# పగ

"తాతా ఒక బీడి అందుకో"

గొంగళి కప్పుకుని కునికిపాటు పడుతున్న రంగయ్య తాత ఆ మాటతో వులిక్కిపడి కళ్ళు విప్పాడు.

చీకటిగా వుండటం వలన ఎదురుగా వున్న మనిషి తాతకు కన్పడలేదు.

"ఎవరు బాబూ" అన్నాడు తాత.

"నేనెవరైతే నీకేంగానీ బీడీ వుందా?" అన్నాడా వ్యక్తి కరుకుగా.

రంగయ్య తాత గొణుక్కుంటూ బీడీ కట్టలోంచి ఒకటి తీసిచ్చాడు.

"ఆచేత్తోనే అగ్గిపెట్టె కూడా అందుకో"

'మళ్ళీ ఇదొకటి?" విసుక్కుంటూనే తీసిచ్చాడు తాత.

ఆ వ్యక్తి అగ్గిపుల్ల గీశాడు. ఒక్కసారిగా మంట పరిసరాల్ని వెలిగించింది.

వెలుగులో ఆ వ్యక్తి ముఖం స్పష్టంగా కన్పించింది తాతకు.

నల్లని ముఖం నుదుటిమీద పెద్దగాటు. బుంగమీసాలు. ఎక్కడా చూసిన ముఖంలా అన్పించలేదు తాతకు.

వెలుగు ఆరింది.

తిరిగి చిక్కని చీకటి అలుముకుంది.

అవ్యక్తి గుండెలనిండా పొగపీల్చి వదిలాడు.

చలిగాలి విసిరికొట్టోంది.

రంగయ్యతాత గొణుక్కుంటూ గొంగళి తలమీదినుంచి కప్పుకున్నాడు.

"ఏవిటి తాతా గొణుక్కుంటున్నావ్"

"చలి బాబూ చలి సంపేతోంది"

"అంత చలిగావుంటె కొట్టుకట్టేసి ఇంటికి పోయి పడుకోకూడదూ" ఆ వ్యక్తి సలహా ఇచ్చాడు.

"పడుకోవచ్చుగాని దీని సిగతరగ నిదరే పట్టిసావదు."

"ఎందుకని తాతా?"

"దగ్గు బాబూ, పడుకుంటే సాలు పానాలు తోడేత్తుంది. దానికన్నా ఇలా కూసోడమే నయ్యం"

అవ్యక్తి మాటాడలేదు. బడ్డీకొట్టు స్తంభానికి ఆనుకుని నిలబడ్డాడు.

రాత్రి పదకొండవుతుంది. చలికి భయపడి కొట్లన్నీ కట్టేశారు. రోడ్డుమీద నరసంచారం లేదు.

చుట్టూ చూశాడు

తను రావాల్సిన చోటుకే వచ్చాడు. అదిగో చర్చిలైటు. కాని ఇక్కడంతా డాబాలే కన్పిస్తున్నాయి పూర్వపు గుర్తులేమీ లేవు

ఈ ప్రదేశమంతా ఎంతో మారిపోయి నట్లుంది.

తన పిచ్చిగానీ ఎందుకుమారదు, పదేళ్ళంటే మాటలా పదేళ్ళల్లో ఎంత మార్పైనా వస్తుంది.

"ఏ వూరు బాబూ మన్ది"

"ఈ వూరేలే, కానీ ఇప్పుడు కాదు అది ఒకప్పటి మాట,"

"మరిప్పుడు ఏ వూరినుంచి వొస్తున్నావ్"

"ఏం తాతా! నా గురించి తెలుసు కోవాలని నీ కెందుకింత ఆరాటం?"

రంగయ్యతాత క్షణం మాటాడలేదు.

"అవును, నిజమె బాబూ, నువ్వెవ్వరైతే నాకెందుకు? నీ దేవూరైతే నాకెందుకు, ఏదో పెద్దముండావాడిని వూర్కోలేక అడిగా"

అవ్యక్తి నవ్వాడు.

'తాతక్కూడా కోపంవచ్చిందే, నా గురించి చెప్తాగానీ ముందిది చెప్పు, నువ్వు కొట్టుపెట్టి ఎన్నాళ్ళయింది?"

"అబ్బో! అదంతా ఒక కథ బాబూ!"

"కథా!"

"అవును బాబూ: ఈ వూరొచ్చి దాదాపు ఎనిమిదేళ్ళవుతుంది: అంతకుముందు ఇశాక పట్నంలో వుండేవోల్లం, అక్కడే నాకొడుకు లారీ పెమాదంలో సనిపోయాడు బాబూ; ఆ తర్వాత నేను నా కోడల్ని తీస్కొని ఈవూరొచ్చేసినా, పెబుత్తంవోరు ఎయ్యి రూపాయలిచ్చినారు, అందులో సొగం పెట్టి పాకేసుకుని మిగిలిన సొగం పెట్టి

ఈకొట్టెట్టినా, ఆ మరుసటేడు నా కోడలు ఎవుడితోనో లేసిపోయింది బాబూ, అప్పట్నించి నేనూ నా కొటూ మిగిలినాం.''

దగ్గు గొంతులో అడ్డుపడడంతో వూపిరాడక వుక్కిరిబిక్కిరయ్యాడు ఆత.

'కాత్తంత సలిగాలి తగిలే చాలు ఈదగ్గు సంపేత్తుంది. నీ పేరేమిటోగానీ నీకు సలెయ్యటంలా.''

ఆ వ్యక్తి నవ్వి---

'నా పేరు సోవయ్యలే తాతా, ఇక చలంటావా, ఈ శరీరానికి ప్రస్తుతం చలీ, ఎండా, వానా ఏం సోకవ్. ఇది ఇనుములే, అద్సరేగానీ తాతా నీఇల్లు ఇక్కడేనా?''

"అదిగో ఆకన్పించే చినిమాహాలు ఎనకే బాబూ,

వెంటనే సోమయ్య--

"అయితే నీకు నాగమ్మ తెలుసా:'' అని ఆత్రంగా అడిగాడు సోవయ్య.

"నాగమ్మా, తెలీదు బాబూ ఆపేరుగలోళ్లెవరూ ఆడలేరే?''

సోవయ్య ఒక్కసారిగా నీరుగారిపోయాడు,

నాగమ్మ ఇక్కడలేదా, ఇక్కడే వుంటుందని ఆశతో వచ్చాడే, ఎక్కడుందో? అసలు ఈవూళ్ళో వుందో లేదో? ఎదయినా పొద్దుండగావస్తే ఎలాగోలా తెలుసుకునేవాడు వెధవరైలు లేటుగా రాబట్టి ఇక్కడ ఇరుక్కుపోయాడు.

సోవయ్యకి కాళ్ళు లాగుతూన్నాయి ఒళ్లంతా నొప్పులుగా వుంది. ఎక్కడైనా పడుకోవాలని వుంది, కాని ఎక్కడికి వెడతాడు? ఇక ఈ రాత్రికి తాతే శరణ్యం, తాతని బతిమాలుకుని చోటు సంపాదించుకోవాలి.

సోవయ్య తాతవేపు చూశాడు, తాత కునికిపాట్లు పడుతున్నాడు.

'తాతా నిద్దరొస్తోందా?'' తాత కళ్ళు విప్పి

"లేదుకానీ, నువ్వింకా ఇక్కడే వున్నావా?''

"చెప్పాగా తాతా నాదీవూరు కాదని, ఈ రాత్రికి కాస్త నీఇంట్లో చోటిస్తావా?''

"దానికేం బాబూ అలాగే,''

"అయితే కొట్టు కట్టెయ్ నాకు నడుంపీక్కుపోతోంది. పడుకుంటాను'' అన్నాడు చేతిలోని బీడీ అవతల పారేస్తూ.

రంగయ్యతాత కొట్టు కట్టేశాడు.

ఇద్దరూ రోడ్డుదాటి రంగయ్యతాత పాక దగ్గిరికి వచ్చారు. తాత తలుపుతీశాడు చేతిలోని లాంతరు చూరుకు తగిలించాడు నేలమీద గోనెపట్టా పరిచి-

"కూసో బాబూ"

సోవయ్య గోనెపట్టామీద వాలి బద్ధకంగా ఒళ్ళువిరుచుకున్నాడు.

"అబ్బ ఇలా విశ్రాంతిగా పడుకుని పదేళ్ళయింది తాతా."

గోడ అనుకుని కూర్చొన్న తాత కొద్దిగా ముందుకు వంగి-

"పదేళ్ళా? ఈ పదేళ్ళూ ఎక్కడున్నావ్ బాబూ."

"రాజమండ్రి సెంట్రల్ జైల్లో."

"జైల్లోనా" తాత వులిక్కిపడ్డాడు అది చూసి సోవయ్య పకపకా నవ్వాడు. నవ్వి-

"ఏం తాతా అలా కొయ్యబారి పోయావ్! జైలునుంచి వచ్చినా నేనేం రాక్షసుడిని కాదు మనిషినే" అన్నాడు సోవయ్య.

"అబ్బే ... ఏంలేదు" తడబడుతూ అన్నాడు తాత.

"తాతా నీకో సంగతి చెప్పనా? మంచోళ్ళే జైల్లో వుంటారు. బయట వుండే వాళ్ళే దొంగలు హంతకులు, పచ్చినెత్తురు తాగే రాక్షసులు అంటూ పళ్ళుకొరికాడు. క్షణం ఆగి -

"తాతా ఇంకో బీడీవుందా?" అనడిగాడు సోవయ్య.

రంగయ్యతాత జేబులోంచి బీడి, అగ్గిపెట్టె తీసిచ్చాడు.

సోవయ్య బీడీ వెలిగించాడు.

తాత దగ్గుతూ గొంగళి దగ్గరికి తీసుకుని ముడుచుకు కూర్చున్నాడు.

'తాతా నిద్దర రావటంలేదు ఎవన్నా కబుర్లు చెప్పు?' అన్నాడు సోవయ్య రెండు చేతులూ తలకింద పెట్టుకుంటూ -

"నేనేం సెప్పగల్ను బాబూ, నువ్వేసెప్పాలి అసలు ముందిదిసెప్పు, నువ్వేంనేరం మీద జైలుకెళ్ళావ్."

సోమయ్య చటుక్కున లేచి కూర్చున్నాడు.

"తాతా, ఆ మాటనకు, నేనేం నేరం చెయ్యలేదు ఇందాకే చెప్పాను. మంచోళ్ళు, ఏనేరం చెయ్యని వాళ్ళే జైల్లో వుంటారని. నేనూ అంతే. ఇంకోవిషయం చెప్పనా, న్యాయాన్ని ఎప్పుడూ జైల్లోనే వుంచుతారు తాతా దాన్ని ఇడిపిస్తే తమని ముంచేస్తుందని పెద్దలకి భయం."

"అయితే ఎందుకెల్లావ్ బాబూ జైలుకి."

"అలా అడుగు చెప్తాను. దాదాపు పదేళ్ళక్రిందట ఈవూళ్లోనే కిష్టయ్య అనే

రిక్షాలాగే వాడుండేవాడు తాతా. వాడికి నాగమ్మ అనే అందమైన పెళ్ళాంవుండేది. వాడికి పెళ్ళాం అంటే పంచప్రాణాలు. ఈ సినిమాహాలు దగ్గిరే వాడిఇల్లు. రోజంతారిక్షాలాగేవాడు. వచ్చిన డబ్బుల్తో నూకలు తెచ్చుకుని. వండుకుని తినేవారు. తర్వాత వెన్నెల్లో కూర్చుని నిద్రవచ్చే వరకూ కబుర్లు చెప్పుకుని ఆ తర్వాత ఒకరి కౌగిట్లో ఒకరు ఒరిగి నిద్రపోయేవారు. రోజులిలా గడుస్తున్నాయి" కొద్దిగా ఆగాడు సోవయ్య.

తాత ఆసక్తిగా వింటున్నాడు.

ఒకరోజు సాయంత్రం ఆరు గంటలవేళ నాగమ్మ. మొగుడు సినిమాహాలు దగ్గిరికి రమ్మంటే చక్కగా ముస్తాబయి బయలుదేరింది. సందు మలుపు తిరిగింది. అక్కడ బడ్డీకొట్టు దగ్గర నాగరాజు నిలబడి వున్నాడు. వాడు నిజంగా నాగుపామే. పచ్చిరౌడీ. వాడంటే ఆ వాడకట్టు వాళ్ళందరికీ భయం. ఎన్నాళ్ళనుంచో నాగమ్మమీద కన్నేసి వుంచాడు. కాని నాగమ్మ వాడికి చిక్కడం లేదు.

ఆరోజు నాగమ్మ బడ్డీకొట్టుదగ్గిరికి రాగానే "ఏం చిలకా, ఎక్కడికి?" అంటూ పలకరించాడు.

నాగమ్మ వినిపించుకోనట్టు నడవ సాగింది.

"నిన్నేనే, తోడెవరూ లేనట్టుంది. నేనూ రానా" అన్నాడు వెకిలిగా నవ్వుతూ నాగరాజు.

"ఒకసారి ఛీ అంటే సిగ్గుండాలి" అంటూ నాగమ్మ ఖాండించి వుమ్మేసింది. చుట్టుపక్కల వాళ్ళు నవ్వారు. నాగరాజు ఆ అవమానానికి వుడికి పోయాడు.

"నామీద వుమ్ముతావటే," అంటూ నాగమ్మ దగ్గిరికి వచ్చి గట్టిగా కౌగలించుకుని ముద్దు పెట్టు కున్నాడు.

"అరె; ఎంతపని చేశాడు ఎదవ" అన్నాడు తాత.

"తాతా నువ్వన్నావు ఆ మాట. కాని అప్పుడు ఆ రోడ్డుమీద ఒక్కడు కూడా పల్లెత్తుమాటన్లేదు తెలుసా, నాగమ్మ ఏడుస్తూ ఇంటి కొచ్చి కిష్టయ్యతో చెప్పింది. అది విన్నకిష్టయ్య రాత్రికి రాత్రి నాగరాజు ఇంటికెళ్ళి నిద్రపోతున్న నాగరాజుని లేవదీసి ఆ చెంపా, ఈ చెంపా వాయించి ఇంకోసారి నాగమ్మ జోలికొస్తే, చంపేస్తానని బెదిరించి వచ్చాడు.

తెల్లారింది. కిష్టయ్య తలుపు తీసుకుని బయటకు వచ్చేసరికి పోలీసులెదురుగా వున్నారు. కిష్టయ్య రెండు చేతులకూ బేడీలేశారు. కిష్టయ్య వెనకాలే బయటికొచ్చిన నాగమ్మ అదిచూసి పోలీసుల కాళ్ళమీద పడి ఏడుస్తూ-

"ఎందుకు బాబూ, ఆడికి బేడీలేశారు?" అంది.

"నాగరాజుని చచ్చేట్టు కొట్టాడు. వాడు హాస్పిటల్లో చావుబతుకుల్లో వున్నాడు. అలా దెబ్బలు కొట్టిన వాడికి బేడీలెయ్యక ముద్దెట్టుకోమంటావా." అంటూ కిష్టయ్య నీడ్చుకు వెళ్ళి న్యాయాధికారి ముందు బోనులో నిలబెట్టారు.

కేసు విచారణ ప్రారంభమైంది.

"నీ పేరేమిటి?" అది న్యాయాధికారి ప్రశ్న.

"కిష్టయ్య బాబూ"

"నువ్వు నాగరాజును కొట్టావా"

"కొట్టాను బాబూ కాని ఎందుకు కొట్టాను? ఆడు సేసిన ఎదవపనికి నేను కాబట్టి చెంపదెబ్బల్తోసరిపెట్టాను. మీరయితే చంపెద్దురు బాబూ," అన్నాడు.

"ఏంచేశాడు నాగరాజు"

"ఏం చేశాడంటారా బాబూ నా పెళ్ళాన్ని నడ్రోడ్డు మీద ముద్దెట్టుకున్నాడండీ, అదీనూ సాయంతరం ఏల. మీరడగొచ్చండీ రోడ్డు మీద జనం ఎవ్వరూ లేరా. ఆడిని ఆపలేదా నువ్వు తప్పుడు మాటలు సెప్తున్నావ్ అని. కాని నేను సెప్పేది నూటికి నూరుపాళ్ళూ సత్తెమండీ, ఆడు పబ్బిలీక్కున నా పెళ్ళాన్ని ముద్దెటుకున్నాడండీ అప్పుడా రోడ్డు మీద మనుసులు కూడా వున్నారండీ ఆళ్ళేంచేతున్నారంటారా" టిక్కెట్టు లేకుండా చినిమాచూత్తున్నారు బాబూ, ఈ పవిత్ర బారత దేశంలో ఇటుంటి చీన్లు మళ్ళీ మళ్ళీ దొరుకుతాయో లేదో అనుకుంటూ ఇనోదం చూతున్నారయ్యా అంతమంది ముందు నా పెళ్లాన్ని ముద్దు పెట్టుకున్నాడని కొట్టడం తప్పా మీరేసెప్పండి. సరే తప్పేననుకుందాం. అయితే నేనొకటి అడుగుతా సెప్పండి బాబూ అదే మీమీ పెళ్ళాలి ఎవడైనా అలా సేసాడనుకోండి; మీరేం చేత్తారు;" ఎదురు ప్రశ్నవేశాడు;

ఆ మాటతో అక్కడున్న పెద్దలందరికీ పతివ్రతల్లాంటి తమ పెళ్లాన్ని అంతమాటఅన్నందుకు కోపం వచ్చినట్టుంది. వెంటనే పెద్దదొరవారు కల్పించుకున్నారు.

"సరేనయ్య నీ పెళ్లాన్ని అవమానపర్చాడంటున్నావు అసలది నీ పెళ్లాం అనడానికి సాక్ష్యం ఏది? దాన్ని ఎప్పుడు, ఎక్కడ పెళ్లాడేవ్? ఫొటోలున్నాయా; సాక్ష్యం చెప్పేందుకు పెద్దలున్నారా" అని ప్రశ్నించి అంత చక్కటి ఆలోచన తట్టినందుకు తన తెలివితేటలకి తానే మురిసి పోయాడు.

కిష్టయ్య తెల్లబోయాడు.

'అదేంటి బాబయ్యా మాకవన్నీ ఏడనుంచి వత్తాయ్, దాన్ని గుళ్ళో పెళ్ళాడేను. పెళ్ళిచేసిన దాని అయ్య సచ్చాడు. ఇంకెవరు సాచ్చంసెప్తారు. కావాలంటే దాన్నే అడగండి. అది నాపెళ్ళామే బాబయ్యా.''

'అలాగంటే సరిపోదు సాక్ష్యం వుండాలి ప్రతిదానికీ. నువ్వు పెళ్ళాం అంటున్నావ్, మేము వుంపుడు గత్తె అంటున్నాం. ఇది కాదనడానికి సాక్ష్యం ఏదీ?''

కిష్టయ్య మాట్లాడలేదు న్యాయమే తిరగబడి ప్రశ్నిస్తోంటే ఇక మాట్లాడేదేముంది?

వెంటనే తీర్పు వచ్చింది.

వుంపుడుగత్తె కోసం జరిగిన పోట్లాటలో కిష్టయ్య నాగరాజుని చచ్చేట్టు కొట్టాడు కాబట్టి అతనికి పదేళ్ళు జైలుశిక్ష. అది విన్న కిష్టయ్య నవ్వాడు--బిగ్గరగా నవ్వాడు. కోర్టు అదిరి పోయేలా నవ్వాడు

''బాబూ, ఇన్నారా, అదండీ నాయం. కోరుటు వారు చెప్పే నాయం ఇది. అందరూ సేసింది నాయం. నేను సేసింది అన్నాయం. రెండు దెబ్బలేత్తేనే చచ్చేట్టు కొట్టానని దొంగ నోటీసు పుట్టించిన ఆ నాగరాజుది నాయం. పెళ్ళాన్ని వుంపుడుగత్తెగా సేసి తీరుపిచ్చిన పెద్దదొరవారిది నాయం. డబ్బుల్లేని బాబుల్లారా! కోరుటులనూ, నల్లకోట్లనూ సూసి మోసపోకండి. ఇక్కడా డబ్బులేనోడికి అన్నాయమే దొరుకుతుంది. అసలు పేదోడి పుట్టకే అన్నాయం''.

కిష్టయ్య అరుస్తూ చెప్తున్నాడు. పోలీసులు అతన్ని ఈడ్చుకుపోయి వ్యానులో పడేశారు.

ఈ విధంగా తాతా ఒకటీ రెండూ కాదు పదేళ్ళు జైలుశిక్ష అనుభవించాడు కిష్టయ్య.''

సోవయ్య ఆగాడు గొంతు దుఃఖంతో పూడుకు పోయింది.

రంగయ్య తాత బాధగా నిట్టూర్చాడు.

''ఎంత అన్నాయమై పోయాడు కిష్టయ్య. ఆ తర్వాత కిట్టయ్య ఎక్కడికి పోయాడు బాబూ''

''ఆ తర్వాత. ఇదిగో నీ ఎదురుగా వున్నాడు.''

''నువ్వా... కిట్టయ్యవా...''

''అవును తాతా ఆ కథలోని కిష్టయ్యని నేనే, అన్నాయం చెయ్యబడ్డదీ నేనే. పదేళ్ళు ఇనుప గోడలమధ్య బతికాను. నా జీవితంలో విలువైన కాలమంతా చీకట్లోనే గడిచిపోయింది తాతా'' సోవయ్య కళ్ళు చెమ్మగిల్లాయి.

క్షణం ఆగి అన్నాడు "ఇన్ని బాధలూపడి ఎందుకు తిరిగొచ్చానో తెలుసా!" తాత

"నాగమ్మ కోసమా!"

'అదీ ఒక కారణం అనుకో, కాని నేనువచ్చింది నాగరాజుమీద ప్రతీకారం తీర్చుకోడానికి. నా నాగమ్మని అవమానించి నన్ను అనవసరంగా జైలుకి పంపిన ఆ నాగరాజుని చంపాలి అప్పటిగానీ నా గుండెల్లోని మంట చల్లారదు. నేను ఇన్నాళ్ళూపడిన బాధ తగ్గదు"

తాత మాటడలేదు. కూచునే కునికిపాటు పడుతూన్నడు. సోమయ్య నాగరాజుని గూర్చే ఆలోచిస్తున్నాడు.

* * *

పొద్దున్నే లేచి నాగరాజుని గూర్చి వాకబుచేశాడు సోమయ్య. వాళ్లు చెప్పిన గుర్తులు ప్రకారం నాగరాజు ఇంటిముందు నిలిచాడు సోమయ్య. కాని ఆ ఇల్లు పాకకాదు పెంకుటిల్లు కాదు రెండతస్తుల మేడ. దాన్ని చూసి ఆశ్చర్యపోయాడు. నాగరాజు నిజంగా లక్షాధికారి అయ్యాడా!

సోమయ్య తలెత్తి చూశాడు. నీరెండలో పచ్చరంగు మేడ తళతళలాడిపోతోంది. దాన్ని చూస్తోన్నకొద్దీ సోమయ్యలో కసి పెరిగిపోసాగింది. ఆశ్చర్యం స్థానే కోపం చోటుచేసుకుంది. ఎంతమంది కొంపలార్పి ఎన్ని ప్రాణాలుతీసి ఇంత మేడకట్టాడో? ఇటువంటి వాడిని క్షణంకూడా బ్రతికుండనివ్వకూడదు. చంపాల్సిందే! బొడ్లోని కత్తిమీద చెయ్యివేసి సరిచూసుకున్నాడు.

నెమ్మదిగా గేటుతీసుకుని లోపలకు వెళ్లాడు ఎక్కడా ఏ అలికిడీ లేదు. ముందు గుమ్మానికి కర్టెను రెపరెపలాడుతోంది. దాన్ని తొలగించుకుని లోపలకు వెళ్ళాడు. హాల్లో గోడవారగా సోఫాలు వేసివున్నాయి. అక్కడా ఎవ్వరూలేరు. హాల్లో ఒక ప్రక్కగా పైకి వేళ్ళేందుకు మెట్లు వుంటే వాని వెంబడి పైకి వెళ్ళాడు మేడమీద వరసాగ్గా గదులు కన్పించాయి. మొదటిగది తలుపులు కొద్దిగా వారగా వేసివున్నాయి. సోమయ్య దాని దగ్గరికెళ్ళి తలుపులు తోశాడు.

ఎదురుగా మంచం మీద పడుకున్న స్త్రీ ఆ చప్పుడికి చటుక్కున లేచి కూర్చుంది. ఆవిడని చూసి తెల్లవోయాడు సోమయ్య.

ఆ స్త్రీ ... నాగమ్మ!

నాగమ్మ సోమయ్యని చూసి గుర్తుపట్టి కొద్దిగా కంగారుపడింది. కాని వెంటనే

సర్దుకుని అలాగే కూర్చుంది :

"నాగీ ... నువ్వు ... నువ్వు ... ఇక్కడా!" ఆశ్చర్యంతో సోవయ్య నోట్లోంచి మాటకూడా సరిగ్గా రావడంలేదు.

నాగమ్మ ఆ మాటకి సమాధానం చెప్పకుండా "నువ్వెప్పుడు వచ్చావ్ జైలునించి" అంది.

నాగమ్మ మాటలోనేకాదు అకారంలోనూ కూడా చాలా మార్పు వచ్చింది.

సోవయ్య ఆ ప్రశ్న విన్పించుకోలేదు!

"ఇది నాగరాజు ఇల్లేనా " అన్నాడు.

"ఆ!"

"అయితే నువ్వెందుకిక్కడున్నావ్ "

"నేనిప్పుడు ఆడిదగ్గరే వుంటున్నా" అంది.

ఆ మాటకి షాక్ తిన్నట్లయ్యాడు సోవయ్య. ప్రపంచమంతా గిర్రున తిరుగుతున్నట్లన్పించింది. క్షణకాలం స్దబ్బుగా వుండిపోయాడు.

"నిజంగానా"

"ఆ! నిజమే" అతనివేపు చూస్తూ అంది.

ఆ ముఖంలో సంకోచంగానీ సిగ్గుగానీ కన్పడలేదు. పైగా గర్వరేఖ ఒకటి ఆ కళ్ళలోంచి తొంగిచూస్తోంది. ఆ నిర్లక్ష్యాన్ని చూసిన సోవయ్య మనస్సు కుతకుతలాడి పోయింది.

నాగమ్మ - తన నాగి నాగరాజు దగ్గిర వుంటోంది. ఇంతకన్నా ఘోరం ఇంకేదైనా వుంటుందా. కోపం బుస్సున పొంగింది.

"ఛీ ఎదవ బతుకు? సిగ్గులేదూ ఆడిదగ్గిర చేరటానికి" అని ఛీత్కారం చేశాడు సోవయ్య.

నాగమ్మ లేచి నుంచుంది. సోమయ్యాని తీక్షణంగా చూస్తూ ---

"ఎందుకయ్యా సిగ్గు, నువ్వెళ్ళి హాయిగా జైల్లోకూర్చున్నావ్ ఇక్కడ నేనెలా బతకాలి నాగరాజు రమ్మన్నాడు ఆడిదగ్గిరుంటే నాకేలోటూ లేకుండ చూస్తానన్నాడు. వచ్చాను. హాయిగా వుంటున్నాను తప్పా."

నాగమ్మ అంటున్న ఒక్కొక్కమాటా సోవయ్య గుండెల్లో గునపాలు దింపుతున్నట్లన్పించింది. జైల్లో తను అనేక చిత్రహింసలు అనుభవించాడు కాని అప్పుడెప్పుడూ ఇంతటి బాధ కలగలేదు.

నాగమ్మ ఎంత ధైర్యంగా చెప్తోంది. సిగ్గూఎగ్గూ లేకుండా వాడిదగ్గిర చేరి పైగా తప్పా అని అడుగుతోంది ఈ స్త్రీ కోసమా తను చెయ్యని నేరాన్ని నెత్తిమీద వేసుకుని జైలుకెళ్ళింది ఈ స్త్రీ కోసమా తనింత ఆత్రంగా తిరిగొచ్చింది.

ఆవేశంతో వణికిపోతున్నాడు సోవయ్య, కోపాన్ని ఆపుకోలేకపోతున్నాడు. ఎదురుగా వున్నది తనింతకాలం ప్రాణాధికంగా ప్రేమిస్తున్న నాగమ్మలాలేదు కామ పిశాచిలావుంది. నరరూప రాక్షసిలా వుంది.

'అవునే నీకేదీ తప్పుకాదు. తడిగుడ్డల్తో గొంతుక్కోసే నీలాటి దానికి అన్నీ ఒప్పే. నువ్వింత మోసగత్తెవని తెలీక నీకోసం జైలుకెళ్ళానుగదే, నాజీవితాన్ని నాశనం చేసుకున్నానుగదే నిన్ను...నిన్ను...' అంటూ ముందుకెళ్ళాడు.

"ఏంటిది చంపుతావా," భయంగా అంది నాగమ్మ.

సోవయ్య పళ్ళు కొరుకుతూ--

'అవునే, నీలాటిది బతికుండకూడదు. నిన్నింతగా ప్రేమించిన నన్నే మోసగించి నిలువునా హత్యచేసిన హంతకివి. ఇంకెందర్ని నాశనం చేస్తావో? నీకవమానంచేసిన నాగరాజుని చంపాలని వచ్చాను. కాని నేను చంపాల్సింది నాగరాజుని కాదు నిన్నేనని ఇప్పుడే తెలుసుకున్నాను. నీలాంటి ఆడాళ్ళు లేకపోతే నాగరాజు లాటి వాళ్ళూ వుండరు అందుకని నిన్నే చంపాలి."

అని నాగమ్మ గొంతు పట్టుకుని కళ్ళల్లోకి భీకరంగా చూస్తూ--

"ఆనాడు నీకోసం చెయ్యనినేరాన్ని నెత్తిమీద వేసుకుని బాధతో దుఃఖంతో జైలుకెళ్ళాను. ఈనాడు నిన్ను చంపి సంతోషంగా జైలుకెళ్తాను."

అంటూ బొడ్లోంచి కత్తితీసి నాగమ్మ గుండెల్లో దించాడు. చివ్వున రక్తం పైకి పొంగింది.

నాగమ్మ వెనక్కి పడిపోయింది.

నాగమ్మ రక్తంతో తడిసిన ఆ కత్తివేపు తృప్తిగా చూస్తూ దాన్ని బొడ్లో దోపుకున్నాడు.

చరచరా మెట్లుదిగి పోలీస్‌స్టేషన్ వేపు నడవ సాగాడు సోవయ్య.